# మేలుకొన్న మనసు

శ్రీ 'వాచస్పతి'

పార్కులో నైట్‌క్వీన్ చెట్టుప్రక్క ఇసకలో కూలబడి సిగరెట్ తీసి వెలిగించి గుప్పు గుప్పుమని పొగ వదులుతూ శూన్యంలోకి చూస్తూ అలాగే ఉండిపోయాడు రాఘవేంద్రం. కాసేపటికి సిగరెట్టు అయిపోవటంచేత వేళ్లు చురుక్కుమన్నాయి.

మరో సిగరెట్టు వెలిగించి రేడియోపాటమీదకి దృష్టి మళ్లించాడు. లతామంగేష్కర్ కంఠం నుండి వచ్చే గాన మాధుర్యం—ఆనందాన్ని కలిగించలేక పోతూంది. ఎందుకనో మరి ? విసుగ్గా పశ్చిమదిక్కువైపు చూశాడు. పశ్చిమాద్రిలోకి క్రుంగిపోతున్న సూర్యుని వింత సొయగాల్లో—అరుణ రేఖల్లో—అందాన్ని చూళ్ళేకపోయినందుకు గాభరాపడుతూ లేచి నిల్చున్నాడు రాఘవేంద్రం.

ఆ గాభరాలో గబగబా ఇంటివైపు అడుగు వేశాడు.

అడుగులేస్తూ—అనుకున్నాడు.

చిన్నతనంలో బామ్మ సూర్యుణ్ణిగురించి గమ్మత్తయిన కథలు చెప్పేది. లోకాలను పాలించను ఏడుగుర్రాల రథంలో సూర్యుడు వస్తాడట ! ఆ మర్నాడు ఉదయభానుణ్ణి చూడాలనే ఆశతో ప్రాతఃకాలంతో లేచి మంచులో తడుస్తూ ఆరు బయట నిలబడ్డాడు. అప్పు డనిపించింది—ఓ డాబా ఉంటే ఎంత బావుండేదని ! ప్చ్ ! శక్తికి మించిన కోరికలు !

ఆరోజు ఉదయభానుడు ఎంత అందంగా ఉన్నాడని ! భాస్కరుని కిరణాలు సోకగానే వికసించిన అరవిందంలా తన హృదయారవిందం వెయ్యిరేకులతో—ఇంకా ఎక్కువే !—లెక్క పెట్టలేదుగానీ విరిసి, సవిలాసంగా నాట్యం చేసింది. ఆ అందం యీరోజు కనిపించదేం ? అడుగులు బరువుగా పడుతున్నాయి.

జేబులో ఉన్న పదినయాపైసల బిళ్ల యిక వుండలేనంటూ బరువుగా మూల్గింది. తలెత్తి చూసి ఎదురుగా ఉన్న టీ కాంటీన్‌లో కెళ్లి మంచినీళ్లలా ఉన్న టీ గొంతులో పోసుకుని మళ్లీ నడక సాగించాడు.

మర్నాడు ఆఫీసుకు సెలవని తెలుసు. ఎందుకనో తెలీదు.

ఎందుకో ?

రిపబ్లిక్‌డే అనా ? లేక యిండిపెన్‌డెన్స్ డే అనా ? సర్క్యులర్ సరిగ్గా చదువుకోవాల్సింది.

పోన్లే ! దేనికయితే నేం ? తెలుసుకోని చేసేదిమట్టు కేముంది ? సెలవని గుర్తుంది. అందుకు సంతోషించాలి.

తన జ్ఞాపకశక్తి మరీ 'అధ్వాన్నమై' పోనందుకు తన్ను తానే అభినందించుకుని—నడకవేగం హెచ్చించాడు.

ఇంట్లో అడుగుపెట్టగానే సీత కళ్లు తుడుచుకుంటూ కనిపించింది. అసహ్యం వేసింది. ఛీ ! ఆడాళ్లంతా యింతే !

విసురుగా గదిలోకెళ్లి ఫైళ్లు తెరిచాడు. ఆ ఆఫీసరుకు తనే కనిపిస్తాడు గాబోలు ! ఆఫీసరుకే నేం ? ఎవరికైనా అంతే ! మెత్తనివాళ్లను చూస్తే మొత్తబుద్ధవుతుందన్నట్లు—ఆఫీసులో చేసే గొడ్డుచాకిరి చాలదన్నట్లు యింటికి కూడా మూటకట్టి పంపిస్తాడా? రేపే యివ్వాలట ! ఏమిటో ఆ జబర్దస్తీ ! ఒకవేళ తనే ఆఫీసరయితే . . . . . .

రాఘవేంద్రం యింకేం ఆలోచించలేకపోయాడు.

"అమ్మడుకు జ్వరం తగ్గలేదండీ !" భయంగా అంది సీత.

"జలుబుమీద జ్వరం. రేపటికి తగ్గుతుందిలే" తలెత్తకుండానే అన్నాడు.

"వారంరోజులుగా అలాగే అంటున్నారు." నిష్ఠూరంగా అంది సీత.

"ఏం చెయ్యమన్నావ్ ?" సీతముఖంలోకి చూస్తూ కఠినంగా అన్నాడు.

కళ్లు దించుకుని నేలచూపులు చూసింది సీత.

రాఘవేంద్రం ఫైళ్ళు తిప్పాడు.

సీత మెల్లిగా వెళ్లిపోయింది. ముందుగదిలోనుండి అమ్మడి మూల్గులు సన్నగా వినిపిస్తున్నాయి.

రాఘవేంద్రం చకచకా కాగీతాలు తిప్పుతున్నాడు—రాస్తున్నాడు. రెండు గంటలు అమ్మడి మూల్గులుతప్ప మరే శబ్దం లేదు.

సీత వచ్చి అన్నానికి పిల్చింది.

రాఘవేంద్రం లేచివెళ్ళి కంచంముందు కూర్చున్నాడు.

"అమ్మడు పాలు కావాలంటుంది" పచ్చడి వేస్తూ అంది సీత.

"ఇవ్వు."

"ఈమధ్య పావుపాలేగా వేయించుకుంటుంది."

"ఉ . . ."

"హోటల్లో దొరుకుతుందేమో . . . ." నసిగింది సీత.

"ఇప్పు డెక్క డుంటాయి ? రాగానే చెప్పాల్సింది."

గదిగడపమీద కూ ల బ డి, రాఘవేంద్రంవైపు చూస్తుంది సీత.

రాఘవేంద్రం ఒకొక్క ముద్దే నోట్లో కుక్కేసు కుంటున్నాడు.

"సురేష్‌కు డబ్బు పంపారా ?"

"లేదు" తలెత్తకుండానే జవాబిచ్చాడు.

"పంపకుంటే ఎలా ?"

"వచ్చేయమని రాశాను."

"వచ్చేయమనా ? రెండేళ్ల చదువు ఏమయ్యేటట్లు ?"

"ఏట్లో కలిసేటట్లు !" చీత్కారం చేశాడు రాఘవేంద్రం.

సీతముఖంలో కలవరం స్పష్టంగా కనిపిస్తుంది.

అమ్మడు పెద్దగా మూల్గింది.

మజ్జిగనీళ్లతో భోజనం ముగించి మంచంపై వాలాడు.

కషాయం త్రాగమని అమ్మణ్ణి బ్రతిమాలుతుంది సీత.

అమ్మడు ససేమిరా మాట వినడంలేదు.

"కషాయం త్రాగితే రేపటికి జ్వరం తగ్గిపోతుంది తల్లీ! రేపు కోవాబిళ్లలు చేసిపెట్టొద్దూ ?"

ఐదేళ్ల అమ్మడు విసురుగా మంచంమీదనుండి లేచి—బాలనాగినిలా బుసకొట్టి—"పాలివ్వమంటే యివ్వలేదు . . . . కోవా బిళ్లలు నాకే మొద్దు పో" కషాయం గ్లానును దూరంగా నెట్టేస్తూ అంది.

"బంగారు తల్లివిగదూ !! యిప్పుడు గంట ఎంతయిం దని ? పది ! పాలెలా దొరుకుతాయి ? జావ కాచివ్వనా ?"

అమ్మడు తల అడ్డంగా తిప్పింది.

"వొద్దులే ! యీ కషాయం తాగు. ఉదయాన్నే పాల విడదగ్గర మరో పావు పాలు ఎక్కువ తీసుకుంటాను . . . "

"తలనొప్పి .... ఉ .... నాన్న పాలు తెస్తే ఏం ?" మనసులోమాట బైటపెట్టింది అమ్మడు.

"యిప్పు డెక్కడుంటాయి ? తల్లీ ! అందరూ నిద్ర పొయ్యేవేళ కాదూ ?"

అమ్మడు కోపంగా చూసి కళ్లు మూసుకుంది.

సీత మెల్లగా అమ్మడుతల ఒత్తుతూంది. నిమిష నిమిషానికీ జ్వరం పెరుగుతున్నట్లుంది. థర్మామీటరుండి చూస్తే బావుణ్ను—అనుకుంది సీత. ప్చ్ ! రాఘవేంద్ర దగ్గర కెళ్తే వచ్చే జవాబేమిటో సీతకు తెలుసు.

భారమంతా దేవుడిమీదేసి అమ్మడు ముఖంలోకి చూస్తూ అలాగే కర్చుంది సీత.

రాఘవేంద్ర మంచంలో కాసేపు అటూ యిటూ దొర్లాడు. ఎంత ప్రయత్నించినా కంటిమీద కునుకుపట్టడం లేదు.

హరికెన్‌లాంతరు పొగబట్టి—గుడ్డిగా వెలుగుతూంది.

దీపం తుడవాలన్న విషయం సీత మర్చిపోయిందేమో.

బోర్లా పడుకుని చూపు అందినంతవరకూ గుడ్డి వెలుతుర్లో గదంతా పరికించి చూశాడు.

ట్రంకుపెట్టెమీద రవీంద్రుని 'రాణిఘాట్' కనిపించింది.

ఎన్నిరోజులయిందో — పుస్తకం ముఖం చూసి—అల వాటుతప్పిన చెయ్యి పుస్తకం తీసుకోను బద్ధకించింది. నిద్రాదేవి సమ్మెచేయడంచేత పుస్తకాన్ని బలవంతంగా తెరవాల్సి వచ్చింది.

గుడ్డి వెలుతుర్లో కథ సాగిపోతోంది.

మధ్యమధ్యలో అమ్మడు పలవరింతలూ, సీత అనున యింపులూ వినవస్తున్నాయి.

దూరంగా చర్చి గడియారం రెండుగంటలు కొట్టడం—రాఘవేంద్రం పుస్తకం ముయ్యడం ఒకేసారి జరిగాయి. తనలో ఏదో చైతన్యవాహిని ప్రవహిస్తుంది. ఇంతవరకూ గాఢ సుషుప్తిలో ఉన్న హృదయం జాగ్రదవస్థలోకివచ్చి పూర్వంలాగ (ఐదేళ్ల క్రితంలా) పిచ్చిపిచ్చి ప్రశ్నలు వేస్తోంది. 'రాణిఘాట్'లో విభాదేవి తానై కాసేపు ఆమెహృదయాన్ని పంచుకొని మరోసారి కథావలోకనం చేశాడు.

ఐదు సంవత్సరాల ముందు కెళ్లిన ట్లనిపిస్తూంది.

## 2

ఇన్ని రోజులుగా గాఢనిద్రలో ఉన్న తన కవితా హృదయాన్ని విభాదేవి తట్టి లేపింది.

మేలుకొన్న హృదయం ఐదేళ్ల నిస్సారజీవితాన్ని సర్వే చేసి వెలకట్టేందుకు ప్రయత్నిస్తుంది.

ప్రపంచంలో ఎవరు మోసంచేసినా చివరకు భగ వంతుడు తన్ను మోసగించినా తన కవితాహృదయం తన్ను మోసగించదని గర్వంతో ఛాతీవిరుచుకుని నడిచినరోజులు లేకపోలేదు.

చివరకు ఆ హృదయమే మోసగించింది ! ఆకులన్నీ రాల్చుకుని మోడుబారింది. తిరిగి చిగిరింపచేసేందుకు తను ప్రయత్నించలేదు.

గాఢమైన మత్తుమందు తీసుకున్నట్లు మైకంగా పడున్న హృదయాన్ని లేపాలంటేనే తనకు భయంవేసేది.

జాగ్రుతీ సుషుప్తుల పొలిమేరలమధ్యలో ఉన్నాడు తను. తనలో ప్రాణముంది. బ్రతుకుతున్నాడు. ఎలా బ్రతుకు తున్నాను. చుట్టుప్రక్క లేం జరుగుతూంది ?—అనే విష యాలు తన కనవసరం.

'ఎలా బ్రతుకుతున్నాను' అని ప్రశ్నించుకొంటే—అసలు బ్రతకలేడు.

అందుకనే—యీ హృదయం నిద్రపోవడం మేలనిపించింది.

హృదయంలేని మనుషుల మాటలకు తనహృదయం కెంబేలుపడిపోయేది.

ఆఫీసులో పని చెయ్యనిచ్చేది కాదు—

అన్నం తిననిచ్చేది కాదు—

నిద్ర పోనిచ్చేది కాదు—

షావుకారు సుబ్బయ్య—కంట్రాక్టు విషయ మేదో చూడమని రెండువందలు చేతిలో పెట్టబోతే విషం తినబోతున్నట్లు హృదయం వలవల ఏడ్చింది.

ప్రక్కనున్న రామంగాడు దగ్గరకు పిల్చి, వీపు తట్టి నవ్వి—

"మరీ చాదస్తంలో పడిపోతున్నావ్ ! బతకలేవురా బాబూ !" అన్నాడు.

ఆ సాయంత్రం యింటి కొచ్చేసరికి సురేష్ వోడిపోయిన వీరుడిలా "పరీక్షఫీజు కట్టా లన్నయ్యా !" అని కొంప లంటుకుపోతున్నట్లు కన్నీళ్లు కార్చాడు !

అంత ధైర్యవంతుడు ఎంత దిగజారిపోయాడు !

వాడితోపాటు ఏడిస్తే బావుండదని తను లోపలే ఏడ్చి పూరుకున్నాడు.

ఆ రోజుతో సరి ! యీ హృదయానికి వీడ్కోలిచ్చి, కమ్మని జోలపాటపాడి నిద్రబుచ్చి—ఉదయాన్నే షావుకారును పలకరించాడు.

ఆరోజునుండి—అరుణరేఖల్లోని అందాన్ని చూళ్లేక పోయినా—

లతా మంగేష్కర్ గానమాధుర్యాన్ని గ్రోలలేక పోయినా—

సీత కన్నుల్లోని రాగడోలికల్లో పూగలేక పోయినా—

అమ్మడు చిలుకపలుకుల్లోని సౌహార్దాన్ని అందుకోలేక పోయినా—

అంతరాంతరాల్లో ఏ గోలా లేకుండా జీవితం సాఫీగా గడిచిపోతుంది.

కానీ యీరోజు విభాదేవి నిద్రపోతున్న హృదయాన్ని మేల్కొల్పి, మానవత్వాన్ని మరవనీక బాధ, వేదనా మిగిల్చి పోయింది.

బరువుగా కళ్లు మూతలుపడ్డాయి. కలతనిద్దర—కలతనిద్దర్లో కమ్మని కలలూ. కన్నీటి పాటలూ—

తెలతెలవారుతూండగా కలతనిద్దర్లోనుండి కళ్లు విప్పి చూశాడు. అమ్మడు మరీ భయంకరంగా

మూల్గుతూంది.

హృదయం అమితమైన బాధతో

మూల్గింది !

చివాల్న లేచి కూర్చుని చుట్టుప్రక్క లేం జరుగుతుందో—వో నిముషం పరికించి చూశాడు.

"అమ్మడుకు జ్వరం తగ్గలేదా ?"

సీతదగ్గర్నించి ఎలాంటి సమాధానము రాలేదు.

"నిన్నే సీతా !"

సీత లేదన్నట్లు తల అడ్డంగా తిప్పింది. కిటికీలో నుండి సూర్యకిరణాలు దూసుకువచ్చి గదిని ప్రకాశవంతంగా చేశాయి. కుర్చీలో కూలబడి సీతవంక తదేకదృష్టితో చూశాడు రాఘవేంద్రం.

సీత చాలా చిక్కినట్లు కనిపిస్తూంది. ఆనాటి పచ్చని రంగుకూడా మాయమైనట్లుంది. ఇన్నాళ్లుగా తనెందు కీ విషయాన్ని గుర్తించలేదు.

రాఘవేంద్రం గుండె ఝల్లుమంది. సీత చూపుకోసం మాట కోసం, వెన్నెల్లాంటి నవ్వుకోసం పడిగాపులు కాచిన రోజులు ఎన్ని లేవు ?

అందనిపండని ఆశ నిరాశచేసుకొన్న క్షణాలు తక్కువేం లేవే ?

పచ్చగా, బొద్దుగాఉన్న సీత కన్నులపండువుగా బంతిపువ్వల్లే, అందర్నీ మేగ్నట్‌లా ఆకర్షించే దనడంలో అతిశయోక్తి లేదు.

## 3

ఆ రోజుల్లో తను బి. ఏ. ఫెయిలయి పొట్టకోసం గుమాస్తాగిరి చేస్తున్న అనామకుడు.

సీత ఇంటర్ చదువుతున్న గెజెటెడ్ ఆఫీసరు ప్రియ తనూజ.

చేసుకుంటే సీతనే పెళ్లిచేసుకోవాలనుకున్న రోజులవి. యౌవనపు ఉద్రేకంలో చేసుకున్న తీర్మానాలకు యీరోజు నిజంగా అర్థం లేదనిపిస్తోంది. సీతను చేపట్టేందుకు తనకున్న అర్హత లేమిటి ?

ప్రక్కింట్లో ఉండడం తప్పిస్తే మరొక అర్హతుందా?

అందనిపళ్లకు ఆశ పడ్డంలోనే అందముందేమో! నెలలు జరిగిపోతున్నాయి. తన ఆశలు ఫలించేటట్లు కనిపించడంలేదు.

ఓ రోజున ఆఫీసరుగారు తన ముద్దుల మొద్దబ్బాయిగారికి ట్యూషనుమాష్టరు అన్వేషణలో ఉన్నారని విని తనే స్వయంగా వెళ్లి అప్లికేషను పెట్టుకున్నాడు. తన్ను ఎగాదిగా అద్దాల్లోంచి వోసారి అద్దాలుతీసి మరోసారి చూసి, నొసలు ముడిచి, కళ్లు చిట్లించి, చివరకో చీత్కారం చేసి—

"ఎంత కావాలి ?" అన్నారు.

అమ్మయ్య ! తనకామాటలు చాలు. తనొచ్చింది డబ్బుకోసం కాదుగా ? అందుకే ఏ పేచీ లేకుండా పోయిన పనయింది. ఏ రోజూ ట్యూషనుకు నామంపెట్టినట్లు గుర్తులేదు.

ఆ అబ్బాయికన్నా తనకే దిక్కుమాలిన శ్రద్ధ !

సీతతో మాట్లాడాలంటే చచ్చేటంతటి భయం! ఎంతయినా ఆఫీసరు కూతురాయె! ఆ ఠీవి! ఆ దర్జా ఎక్కడికి పోతుంది.

ప్రతిరోజూ 'యీ రోజు సీతతో మాట్లాడాలి' అని తీర్మానించుకోవడం తీరా మాట్లాడబోయేసరికి గుండె లదరడం, యింటికొచ్చి తీరిగ్గా కూర్చుని తన ధైర్యానికి తనే మురిసిపోవడం జరుగుతుండేది!

ఓరోజు అదేదో హిందీ సినిమానుండి తిరిగి వస్తున్నాడు. సీత విసురుగా నడుస్తూ వెళ్తూంది. వెనక కొంటె బ్బాయిలు—ఏదో వాగుతున్నారు. ఇల్లు చేరుకోవాలంటే కనీసం యింకో రెండు ఫర్లాంగులైనా నడవాలి. సీత నాలుగు వైపులా చూసింది. రిక్షాకోసం కాబోలు. పాపం! ఓ రిక్షా అన్నా ఉంటేనా?

తను విషయాన్ని క్షణంలో అర్థంచేసుకుని వెళ్లి పలకరించాడు. కోపంతో ఎర్రబడిన సీతముఖం (తనమీద కాదు సుమండీ!)—వీధిలైటు కాంతిలో చూడ ముచ్చటగా ఉంది! "సమయానికో రిక్షా అన్నా లేదు. "ఇంటిదగ్గర వదుల్తా రండి!" ఎలాగో ధైర్యంచేసి అన్నాడు.

సీత తేలిగ్గా శ్వాస పీల్చి, వెనక్కు తిరిగిచూసి—

"రాస్కెల్స్! మెల్లగా జారుకుంటున్నారు!"

"వాళ్ల ధైర్య మంతవరకేలెండి!" అన్నాడు తన ధైర్యానికి మురిసిపోతూ.

సీత నవ్వింది. ఎందుకో మరి? తన కర్థంకాలేదు.

"ఒంటరిగా బయల్దేరారేం?"

"నాన్న జవాన్ని పంపిస్తానన్నారు. ఎందుకనో మరి రాలేదు."

"రిక్షా అన్నా చేసుకోవాల్సింది."

"ప్రక్కసందువరకూ నా ఫ్రెండూ నేనూ వచ్చాము—యీ కాసింత దూరానికి రిక్షా ఎందుకని ...."

నసిగింది సీత.

"యింతకూ ఎక్కణ్నించి? సినిమానుండా?"

"మా కాలేజీ వార్షికోత్సవాలు జరుగుతున్నాయండీ! అక్కణ్నుండి!"

"ఇకమీద ఎప్పుడూ అలా ఒంటరిగా బయల్దేరకండి!' తను మందలించాడు. ఏమిటో తన కప్పుడే పెద్ద అధికారం, చనువు కలిగినట్లు!

సీత జవాబుగా సన్ననినవ్వు నవ్వి లోపలికి వెళ్లిపోయింది.

మర్నాడు సీతలో పెద్ద మార్పుంటుం దనుకున్న తనకు నిజంగా నిరాశే ఎదురైంది. సీత మామూలుగానే ఉంది.

అయితే భేదమల్లా—తనిప్పుడేదన్నా ప్రశ్న వేయ దల్చుకుంటే గోడలకు వేయనవసరం లేదు. ధైర్యంగా సీతనే అడిగేస్తున్నాడు. సీతకూడా నెమ్మదిగా జవాబు లిస్తుంది.

అలా నెలలు గడిచాయి.

మొద్దబ్బాయి కాస్త దార్లోకొచ్చాడు. ఆఫీసరుగారు అభినందించకుండా ఉండలేకపోయారు.

అయితే ఆ రోజూ, యీరోజూ సీత అందనిపండు లాగే ఉండిపోయింది. ఎలాగయినా యీ విషయాన్ని ఓ దార్లోకి తేవాలనుకున్న తన నిశ్చయం ఏరోజు కారోజే గాల్లోకి తేలిపోతుంది!

ఓరోజు ఆఫీసరుగా రిల్లు బహు సందడిగా ఉంది.

"ఏమిటి విశేషం?" అని అడక్కుండా వుండలేక పోయాడు శిష్యుడ్నే.

"ఎవరో వస్తున్నారు."

"ఎవరో వస్తే" యింత హంగామా ఎందుకు? ఒళ్లు మండింది.

" 'ఎవరో' ఎందు కొస్తున్నారు?"

"అక్కయ్యను చూసేందుకు."

"ఉహు ....... "

తనమూతి నాలుగు వంకర్లు తిరిగేసరికి అసలే పెద్దగా ఉన్న వాడికళ్లు మరింత పెద్దవయ్యాయి.

తర్వాత నాల్గు రోజులు యిల్లంతా చీమ చిటుక్కు మన్నా శబ్దమయ్యేంతటి ప్రశాంతంగా ఉంది.

అందుకు తను ఆశ్చర్యపడ్డంలో చిత్ర మేముంది?

"మీ అక్కయ్య యింట్లో లేదా?"

"ఉంది."

"సీత మౌనవ్రతానికి కారణమేంటో రెండు రాత్రిళ్లూ, రెండు పగళ్లూ ఆలోచించినా తన కర్థంకాలేదు. వారం రోజులు జరిగినా అసలువిషయం అంతు పట్టలేదు.

మామూలుగా ట్యూషను చెప్పేందుకు వెళ్లాడు—ఆరోజు—

ఆఫీసరుగారు వరండాలోనే ఎదురై చిరునవ్వు విసిరి, కుర్చీ చూపించి, "కూర్చోవోయ్!" అంటూ ఆప్యాయత ఒలకబోశారు.

ఆ అకారణ అనుగ్రహానికి కారణాలు వెతుక్కోలేక బుర్ర పాడయినమాట నిజమే!

ఎలాగయితే నేం? కష్టపడి తన పుట్టుపూర్వోత్తరాలన్నీ లాగారు!

ఏరోజు అలవాటులేంది ఆరోజు ప్రియశిష్యుడు కాఫీ, టిఫినుతో ఎదుట నిలబడ్డాడు!

"యీ బొమ్మలేసిపెట్టరూ? అంటూ సీత ఫిజిక్సు రికార్డుతో దర్శనమివ్వగానే విషయం పూర్తిగా అర్థమైంది.

తనేమంత గొప్ప ఆర్టిస్టు కాడు. చచ్చీ చెడీ రాత్రి పన్నెండువరకూ కూర్చుని నీటుగా బొమ్మలు వేసిపెట్టాడు.

"నాకన్నా బాగానే వేశారు" అంది సీత.

మరీ పొగడితే ఆకాశంలోకి ఎగిరిపోతానని గాబోలు! ఆమాత్రం పొగడ్త చాల్లే అనుకుని తను తృప్తిపడ్డాడు.

"పోయిన జన్మలో 'బంతి'పువ్వుగా పుట్టి ఉంటావు. లేకుంటే యింత పచ్చగా, బొద్దుగా ఉండవు సీతా!" అన్నాడు తను.

"అంత లావున్నా నేమిటి?" బుంగమూతి పెట్టింది సీత.

"ఛా! ఛా! లావని ఎవరన్నారు? బొద్దుగా ముద్దొస్తున్నావు గానీ ….. "

"అక్కయ్య లావేనండీ! మాస్టారూ!" లెక్క వెయ్యడం మాని తన అభిప్రాయం వెల్లడించాడు శిష్యుడు.

"ఊ …. నీకన్నా నేమిటి?" వాడి తలమీదో మొట్టికాయ యిచ్చి అంది సీత.

ఊహు …. లెక్క వెయ్యరా! నాగమ్మా!" అని ఓ ఉరుమురిమి—సీతవైపు తిరిగి—

"ఈ అనుగ్రహం శాశ్వతమైందా? లేక మురిపించి పారిపోతావా సీతా!" అని తన సందేహాన్ని బైటపెట్టకుండా ఉండలేకపోయాడు. సీత నవ్వుతూ లోపలికి పారిపోయింది. ఇంతవరకూ స్త్రీహృదయం అగాధమని వినడమే గానీ—ఆరోజు ప్రత్యక్షంగా చూచి నిజమనుకున్నాడు. మహానుభావులు చెప్పినమాట ఏరోజూ పొల్లుబోదు.

చచ్చి ఏ లోకా నున్నారో మావగారు — తనచేత సీత మెళ్లో తాళి కట్టించి తన విశాలహృదయాన్ని ప్రకటించుకొన్నారు.

తర్వాత సీతతో గడిపిన మధురక్షణాలు—నిజంగా వాటికి విలువకట్టను తనచేతకాదు.. ఆ రోజులు వేరు. ఆ మధురానుభూతిని వర్ణించను తను కవికాడు. కానీ తనకు కవితాహృదయ ముంది—అది—

గులాబీలా అతి కోమలం
అరవిందంలా అతి మనోహరం
విరజాజిలా అతి సుగంధభరితం.

"మీ రో కవికుమారులు కావల్సింది! ఎందు క్కాలేదో" అంది సీత ఓరోజు.

"నిన్ను చూశాను కదూ? యిక కవికుమారుడు నాలో ప్రవేశిస్తాడు గాబోలు! ఒద్దులే! సీతా! ఆ కవిత్వంలో పడి నిన్ను మర్చిపోవచ్చు."

సీత నిండుగా నవ్వింది. ఇప్పుడు నవ్వినట్లే ఉంది.

రాఘవేంద్రం కళ్లుతెరచి సీతవైపు చూశాడు. శోకదేవతలా ఉంది సీత. పువ్వులాంటి తన హృదయం—యీరోజు—యిలా—అచేతనంగా ఎందుకు పడుంది? నిర్దాక్షిణ్యంగా తన హృదయాన్ని 'వీళ్లు' నలిపారు.

వీళ్లకెందుకు తనమీ దింత కక్ష?

తనేం పాపం చేశాడని?

అమ్మడు కళ్లుతెరచి సీతనేమో అడుగుతుంది.

చీకటితెరల్లో మైమరచి నిద్రపోతూ, మానవతను కోల్పోయిన హృదయం—పశువాంఛలను తీర్చుకొనేందుకు ప్రయత్నించిందేగానీ—ఏనాడన్నా మానవత్వపు లోతుల్ను చూడ కలిగిందా?

—కానీ—

ఆ చీకటిలోకంలోనే—

ఆ జాగ్రుతి లేని గాఢనిద్రలోనే—సంతృప్తి, సంతోషం, సుఖం—ఉన్నాయని మురిసిపోయి మరీ చీకటి లోకాల్లోకి పరుగులుతీసిన రోజులు లేకపోలేదు. అందరు చీకటిని భరించలేకపోతే—తను వెలుతురు భరించలేకపోయేవాడు.

సూర్యుని వెలుగంటే భయం—
మెర్క్యురిలైటు కాంతంటే భయం—
పున్నమిచంద్రుని వెన్నెలంటే భయం—
ఉండీ లేనట్టున్న నక్షత్రాల వెలుగూ—
వెలిగీ వెలగనట్లున్న ఆముదందీపం కాంతీ—

ముఖ్యంగా అమావాస్యనాటి చికటీ—తన హృదయానికి ఓ విధమైన మత్తుతో కూడిన ఆనందాన్నిచ్చేవి.

## 4

అమ్మడు బాధతో మెలికలుతిరిగిపోతోంది. సీత వెక్కిళ్ళు రాఘవేంద్రం ఊహల్ని పటాపంచలు చేశాయి.

సీతా! ఏవిటి? అమ్మడు కేంజబ్బంటావ్?"

"నేను డాక్టర్ను కానే?" సహనమంతా యింకిపోయిన సీత మండిపడింది.

"డాక్టరుదగ్గరకు తీసుకుపోనా?"

"ఆజ్ఞాపించేందుకు నే నెవర్ని చెప్పండి?"

"ఏం మాటలు సీతా? డాక్టర్నే తీసుకొస్తానుండు" అంటూ వీధిలో కెళ్లాడు రాఘవేంద్రం.

ఇద్దరు డాక్టర్లను చూశాడు.

'పదిగంటలక్కానీ బైటకు కదలం" అన్నారు.

మరో డాక్టరు నిద్రే లేవలేదట!

మరో యిద్దరు అమ్మాయిని తీసుకురమ్మని సలహా యిచ్చారు!

చిరకాలనిద్రనుండి మేల్కొన్న హృదయం మంటలు కక్కింది. ప్రపంచాన్నంతా భస్మీపటలంచేసే ఏ హైడ్రోజన్ బాంబో వుంటే—పేల్చి ప్రతీకారం తీర్చుకుందుకు లేక పోయింది కదా—అని వలవల ఏడ్చింది. ఈ డాక్టరు రానంటే చెంపలు వాయించమని సలహా యిచ్చింది రాఘవేంద్రానికి. ఆ డాక్టరుగారి అదృష్టం బాగుండి రిక్షా పిలవమన్నాడు.

తనూ ఓ రిక్షా తీసుకొని వెంట వెళ్లాడు రాఘవేంద్రం.

పరీక్షచేసి, ఓ యింజక్షనిచ్చి, కాఫ్ పిల్సు రాసిచ్చి—విజిటింగ్ ఛార్జితోసహా కలిపి బిల్లు చేతిలో పెట్టా—

''రెండుగంటల కోసారి రెండేసి క్యాప్స్ చొప్పున యివ్వండి!'' అన్నాడు.

బిల్లు తీసుకుని జేబులో పెట్టుకుని ''ఫస్టుకు చూస్తా నండీ !'' అన్నాడు చేతులు నలుపుకుంటూ రాఘవేంద్రం.

డాక్టరు మింగేటట్లు చూసి రిక్షాలో కూలబడ్డాడు—చేసేది లేక.

అభిమానంతో ఏడ్చింది హృదయం. సంపాదించాలని ఎంత ప్రయత్నించినా అదీ దూర దూరంగా పోతుంది. దానికీ అదృష్టం ఉండాలిగాబోలు ! వ్రతంచెడ్డా ఫలం దక్కన ట్లయింది చివరకు.

అడ్డదారులు తొక్కి గడ్డితిందామన్నా అదీ అందడం లేదు. ప్చ్ ! ఏం బ్రతుకులో ! కంట్రాక్టర్లంతా నేరుగా ఆఫీసరుదగ్గరకే పోతున్నారు! అమ్మడుకు మందు తెద్దా మన్నా చేతిలో చిల్లిగవ్వ లేదు.

''డాక్టరేం చెప్పారండీ ?''

''యిదో ! యీ క్యాప్స్ తెచ్చి వెయ్యమన్నారు.''

''యిప్పు డిప్పుడే షాపులు తెరవరా ?'' రాఘవేంద్రం యింకా కదలకపోవడం చూసి అంది సీత.

''షాపులు తెరవకేం ? అసలు డబ్బే లేదుగానీ ....'' నసిగాడు.

సీత మరేం మాట్లాడ్లేదు. శూన్యంలోకి చూస్తూ అలాగే కూర్చుంది.

''రామంనన్నా అడుగుతాను. అమ్మడు జాగ్రత్త'' అంటూ వీధిలో కెళ్లాడు. వెదక బోయిన తీగ ఎదురైనట్లు రామారావు ఎదురై—రాఘవేంద్రం చెప్పింది పూర్తిగానన్నా వినక జేబులోని పదిరూపాయలకాగితం తీసి రాఘవేంద్రం చేతిలో పెట్టాడు. రాఘవేంద్రం ఆశ్చర్యంతో స్నేహితుడి ముఖంలోకి చూశాడు.

''ఏం ? సరిపోదా ? సాయంకాలం పట్టుకొస్తా .... యిప్పటికా క్యాప్స్ కొనుక్కెళ్ళు.''

''రామం !''

''ఏం ?''

''నువ్వూ అందర్లో ఒకడి వనుకున్నాను.''

''కాదా మరి !''

''మానవత్వపు పొలిమేరల్లోనే ఉన్నావు. మనుషుల్ని అర్థంచేసుకోవడం కష్టమేరా ?''

''ఇప్పుడు తెలిసిందేమిటి ? ఏడిశావులే ! త్వరగా వెళ్లు.''

రాఘవేంద్రం పరుగుల్తో యిల్లు చేరాడు. ఆరోజంతా అమ్మడి మంచంప్రక్కనే కూర్చున్నారు సీతా, రాఘవేంద్రం.

మింగే క్యాప్స్ మింగుతున్నా జ్వరం దానిపాటికది ఎక్కు వవుతూనే ఉంది.

సాయంత్రం రామారావొచ్చి—హెచ్చరిక చేసేంత వరకూ తా మే స్థితిలోఉండేదీ తెలిసిరాలేదు.

అమ్మణ్ణి భుజాన వేసుకుని రిక్షాలో డాక్టరింటికి తీసి కెళ్లాడు రామారావు.

అచేతనంగా వెంటవెళ్లాడు రాఘవేంద్రం.

డాక్టరు చెయ్యిపట్టుకుని నాడి చిక్కక వదిలేశాడు.

అమ్మడి భౌతికశరీరాన్ని హృదయానికి హత్తుకుని హాస్పిటల్లోనే భోరుమన్నాడు రాఘవేంద్రం.

వార్త నిముషాలమీద ప్రాకిపోయింది.

సానుభూతిపరులంతా వచ్చి ముఖంచూపి పోయారు !

మర్నాటి ఉదయం తెలివిలో కొచ్చింది సీత.

రాఘవేంద్రం హోటలుకెళ్లి కాఫీ తెచ్చాడు.

దోసిట్లో ముఖం పెట్టుకుని కాఫీ దూరంగా నేట్టే సింది సీత.

''ఏవిటి సీతా ! పోయినవాళ్లతో మనమూ పోతామా ?''

''మీకు హృదయంలేదు ...... మీరు మారిపోయారు'' దోసిట్లో ముఖం పెట్టుకుని వలవల ఏడ్చింది సీత.

''ఏం ? నీలాగ నేను ఏడవలేదనా ?''

''అమ్మడిని చేతులారా చంపారు .... అది మీకేం పాపం చేసిందని .... మీ కడుపులో పుట్టడమే ఓ పాపమా ? నా చిట్టి తల్లిని .... నిర్దాక్షిణ్యంగా....అబ్బ ! మీకు చేతు లెలా వచ్చాయి?''

''సీతా !'' గావుకేకపెట్టాడు రాఘవేంద్రం.

''అలా అరవగానే భయపడతా ననుకున్నారా ? .... కానీ .... నిజం చెప్పేందుకు నే నేరోజూ భయపడను .... నే నిజం చెప్పానో లేదో మీ అంతరాత్మ నడగండి .... ''

''నిజమే చెప్పానంటావా ?'' హతాశుడై కుర్చీలో కూల బడుతూ అన్నాడు రాఘవేంద్రం. సీత చేసిన నేరారోపణ ఎంత పెద్దదో, అసలు తెలిసే అంటుందో, తెలీకే అంటుందో రాఘవేంద్రానికి తెలిసిరాలేదు.

అమ్మడు పోయినందుకు తనహృదయం వ్రయ్య లౌతుంటే ? తనకేనా ఆ దిగులు ? మామూలు జ్వరం కాబోలు—ఏదో నాలుగురోజుల్లో తగ్గకపోతుందా అను కున్నాడుగానీ – యిలాంటి విషమపరిణామాలకు దారితీస్తుందని తనకుమటుకేం తెలుసు ?

పాడు హృదయం—మళ్లా నిద్రపోతేనే బాగుండును.

అయితే సీత చేసిన నేరారోపణ నిజంకాదా ? నిజమే ! తనవారిపట్ల తనకింత నిర్లక్ష్యం ఎందుక్కలిగింది ?

ఏ రోజయితే తనకిష్టంలేని పనులన్నీ యీ మనుషులు తనచేత చేయించారో ఆనాటినుండీ తన హృదయం మూగవోయి, నిద్రపోయి—తన్నొక యంత్రంగా మార్చింది.

ఎవరెలాపోయినా తన కక్కరలేనట్లుగా ఉండిపోయాడు.

అవును మరి—తన యిష్టా యిష్టాల నెవరన్నా చూశారా ? లేదు. మరి తనెందుకు చూడాలి ?

ఊహు .... యీ కుతర్కంతోనే తన హృదయాన్ని నిద్రబుచ్చాడు. దాంతో అమ్మడు శాశ్వతంగా దూరమైంది.

భగవంతు డెందు కీ సంఘటన కలిగించాడో ?

మిగిలిన మానవతనుకూడా దోచుకోవాలనా ?

దోపిడీదొంగల్ని మించిపోయాడు భగవంతుడు !

స్ప్ ! ప్రాణప్రదంగా చూచుకొనేవారిని మధ్యలోనే తీసికెళ్తాడు. ఆరోగ్యాన్ని, ధనాన్ని గాలిలోకి విసిరేసి—కన్నీటి వరదలో యీదులాడమంటాడు.

అందులోనే ఆనందముందేమో !

ఎంత కఠినాత్ముడు ! ఓరోజు తన ప్రాణప్రదంగా సీతను ప్రేమించేవాడని చెబితే ఎవరైనా నమ్ముతారా ?

తన ప్రాణంమీదే తన కెందు కింత నిర్లక్ష్యం ?

సీతా ! భగవంతుడు వట్టి కఠినాత్ముడు. తన విలాసానికి మన ప్రాణాల్తోనే ఆడుకుంటాడు. మనచేతిలో ఏం లేదు. మనం నిమిత్తమాత్రులం—ఆ విషయం తెలీక నన్ను నిందిస్తున్నావు ....

"చేసినపాపం చాలు .... యింకా ఎందుకు కొనితెచ్చుకుంటారు ?"

పైట చెరగుతో కళ్ళు తుడుచుకొంటూ అంది.

"ఓహో ! నీ భగవంతుడు దయాస్వరూపుడు కదూ?"

"ఎందుకిలా హింసిస్తారు .... అబ్బ ! ఎంత మారిపొయ్యారు .... " దుఃఖాన్ని ఆపుకోలేక మంచంపట్టెమీద తల ఆన్చి విలపించింది సీత.

సీత కన్నీరు రాఘవేంద్రం హృదయాన్ని ద్రవ్యీలు చేసింది.

"చూడు సీతా ! మళ్లీ తప్పకుండా తిరిగి మనదగ్గర కొస్తుంది అమ్మడు .... మనల్ని వదిలిపోదు సీతా ! .... నావల్ల పెద్దతప్పే జరిగిపోయింది .... నే నెందు కిలా మారిపోయానో అర్థంకావడంలేదు .... యీసారికి నన్ను క్షమించానను......."సీత చేతులు తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు రాఘవేంద్రం.

రాఘవేంద్రలో పూర్వం తను చూసిన హృదయాన్ని చూసి, పోగొట్టుకున్న దేదో దొరికినట్లు తలెత్తి రాఘవేంద్ర ముఖంలోకి చూసింది సీత. సీతచెక్కిళ్లమీద కారే కన్నీటిని తుడుస్తూ—

"ఇలా అవుతుందని నాకుమటుకేం తెలుసు ? భగవంతుడు నిజంగా నిర్దయుడు .... లేకుంటే నా హృదయాన్నెందుకిలా నలిపేస్తాడు .... '

"తప్పు."

రాఘవేంద్రం నోటిని తన చేత్తో మూస్తూ అంది సీత.

"అమ్మడికోసం కన్నీటితో ఎదురుచూస్తుంటాం. మా మాటగా చిట్టితల్లితో చెప్పు" అని సూర్యభగవానునితో చెప్పుకొంటున్నారా అన్నట్లుగా — కిటికీలోనుండి ఉదయభానుణ్ణి చూస్తూ అక్కడే—అమ్మడి మంచందగ్గరే కూర్చున్నారు, సీత, రాఘవేంద్రము.